5

# మనం మనుషులం

"ఎందుకిలాంటి పనిచేశావ్ ? నాకేనా వివరంగా చెబ్తావా, చెప్పవా?" ప్రశ్నించిన మాధవరావు వైపు తలెత్తి చూశాడు పార్థసారథి, నవ్వేడు.

"నవ్వుతావు కూడా ఎందుకు, సిగ్గులేక? బియ్యే రెండేళ్ళు కలిసి వెలిగించాం. ఒకకంచంలో తిని ఒకే మంచం మీద పడుకోడానికి మనమేం మొగుడూ పెళ్ళాలం కాదు గాని ఒకే అగ్గిపుల్లతో ఇద్దరం సిగరెట్లు వెలిగించుకుని హాయిగా హాస్కు కొట్టుకునే వాళ్ళం. అప్పట్లోనే నీ విప్లవ ధోరణి నన్నెంతగానో ఆకర్షించింది. మళ్లీ ఆరునెలలనాడు ఈవూళ్ళోనే నాకు పోస్టింగు వచ్చిన నాడు, నువ్విక్కడే ఉన్నావనీ, ఈ తరుణారుణ సమితిలో ముఖ్య పాత్ర వహిస్తున్నావనీ తెలిసి ఎంతో సరదా పడ్డాను. వెంటనే నేనందులో చేరడమే కాదు, సెక్రటరీ పదవికి కూడా పోటీచేసి ఎన్నికయ్యాను. ఎందుకు? ముఖ్యంగా నిన్ను చూసుకునే! ఇవాళ నాచేత్తో చేసే నీసభ్య

త్వాన్ని రద్దుచేస్తూ ఉత్తరువు జారీ చెయ్యవలసి వచ్చింది! ఇంతటి ఘన కార్యం చేసి ఏదో ఉద్ధరించినట్లు ఆ ముసి ముసి నవ్వులు కూడా ఎందుకూ?"

"అబ్బే" నువ్వెంత శరవేగంతో ఒక్కొక్క సిగరెట్టు ఊదేస్తున్నావో చూస్తూంటే, నాకు నవ్వాగడంలేదు. అవకాశం లేకపోయింది గాని నోటిలోంచి ముక్కులోంచే కాకుండా, చెవుల గుండా కళ్ళగుండా పొగ వదుల్దువు, అంత కసిగా ఉన్నట్టుంది నీకు! ఇంత కోపం నామీద వచ్చిందంటే నీ గుండెల్లో నామీద ప్రేమ ఎంత నిండుగా ఉందో! కాని నా యీ ప్రవర్తనకి కారణం తెలుసుకోవాలంటే కేవలం అభిమానం చాలదు. విచక్షణా, నిదానం అవసరం, అన్నాడు పార్థసారథి నెమ్మదిగా ...

"ఒరే సారథీ, ఇంకా ఎందుకు ఈ వ్యాక దంపుడు ఇంట్రడక్షన్‌తో ప్రాణాలు తీస్తావ్? చేసిందేమో చచ్చుపని ఆ నాడు కిక్కిరిసిన సభారంగంలో—దేశంలో వున్న దేవుళ్ళందరికీ ఒకే సారి మొక్కు కుంటున్నాను, ఎవరి గుడికీ ఏ పరిస్థితిలోనూ ఇక రాను!— అని నువ్వు మహోత్సాహంతో ప్రకటిస్తే ఆకాశం అందుకున్నాను సంతోషంతో. మొన్న మన సమితి ప్రెసిడెంటుకి నువ్వు పెట్టుకున్న కాగితం, ఏది—నేనూ నా భార్యా పై శుక్రవారం తీర్థయాత్రల కని బయలు దేరుతున్నాం. కాబట్టి ఒక నెలరోజుల పాటు మన కార్యక్రమాలలో పాల్గొనలేను—చూపిస్తే భూమిలోకి క్రుంగి పోయాను, సిగ్గుతో.—ఇంతటి చిత్తశుద్ధి ఉన్న తమరు మన కార్యక్రమాలలో ఇంకా పాల్గొనడం దేనికి? భక్తి ప్రపత్తులతో పవిత్ర

భారతిని మరింత పావనం చెయ్యండి. మూల సూత్రాలకే గొడ్డలి పెట్టు అయినది మీ ప్రవర్తన. క్రమశిక్షణ చర్యగా మీ సభ్యత్వాన్ని రద్దుచేస్తున్నాము— అంటూ నేనే సంతకం చేసి నీకు కాగితం పంపక తప్పలేదు తగిన సంజాయిషీ ఇచ్చు కుంటే ఇప్పటికేనా నీ సభ్యత్వానికి ఢోకా ఉండదు. నేనె లాగో మిగిలిన వాళ్ళకి నచ్చ చెబుతాను"

"నో డోన్ట్‌వర్రీ. చేసినది తప్పు అని తోస్తే సంజాయిషీయే కాదు, క్షమాపణ పత్రమే సమర్పిస్తాను, నేనేం సందేహించను. ఎంత ఆలోచించినా నాకలా తోచడంలేదు గనక అలా ఇవ్వడం జరగదు. ఇక నాయీ ప్రవర్తనలోని మార్పుకి చెప్పుకోవలసింది సమాధానం మాత్రమే. అది ఎవ రికో కాదు, నాలో నాకే. నువ్వు సహృదయంతో వింటావని నాకు నమ్మకముంది. నీకు చెప్తే నాకు నేను చెప్పుకున్నట్టే" మాధవరావు పార్థసారథి రెండు చేతులూ పట్టుకున్నాడు, 'కేరీ ఆన్' అంటూ.

"కాలేజీ వదిలిపెట్టి మనం ఎవళ్ళకి వాళ్ళు జీవితాలలో ప్రవేశించాక, ఈ పదిహేనేళ్లలో నాలో ఏమేం మార్పులు వచ్చాయో నువ్వేం ఊహించి ఉండవు. పెళ్ళినాడే నువ్వు నా భార్య అన్నపూర్ణని చూడడం అనుకుంటాను. అన్నట్టు నా గురించి కంప్లీట్ పిక్చర్ నీకు దొరకాలంటే మా అత్త రుక్మిణి గురించి కూడా ముందొక మాట చెప్పడం అవసరం" అంటూ పార్థసారథి మొదలుపెట్టేడు. మాధవరావు అటు చూడ్డంలేదు, సముద్రపొడ్డున మిత్రుడి పక్కన వెన్నెలలో వెల్లకిలా పడు

కున్న అతను నిర్మలాకాశానికి సిగరెట్ పొగ మేఘాలు శక్తి కొద్దీ సప్లయి చేస్తూ, ప్రతీ అక్షరం శ్రద్ధగా వింటున్నాడు.

"తెలుసుగా నీకు, పుట్టకముందే తండ్రినీ. పుట్టిన వెంటనే తల్లినీ పోగొట్టుకున్న మహానుభావుణ్ణి! నేను! శాస్త్ర జ్ఞానం వచ్చేదాకా నన్ను మా అత్తే పెంచింది. అత్త అంటే మేనత్తకాదు, వేలువిడిచిన మా మేనమామ భార్య. హైస్కూలు చదువు సేజీలోనే నన్ను హాస్టలులో పెట్టి నెల నెలా నాకు డబ్బు పంపేవారు. మా రుక్మిణత్త నుంచి నాకేం ప్రేమాభిమానాలు లభించలేదు. అలాగని నిరాదరణా ఎరగను. అంత చిత్రమైన వ్యక్తిత్వం ఆమెది, 'చాలీచాలని సంసారం. మనకి ఏముందని ఆ కుర్రాడికి పెడతాం! తండ్రేదో ఇంత ఇచ్చిపోయాడు గనక అతన్ని చాపించగలుగుతున్నాం. పైగా అవసరం వస్తే అంతో ఇంతో అందులోదే మన కుటుం బానికని అప్పుడప్పుడు వాడుకుంటున్నాం... నిజం ఒప్పుకోడా నికి భయం కూడా ఏందుకూ?' అని ఆమె వోసారి నే ఎదురు గుండా ఉన్నాననైనా ఏమాత్రం సందేహించకుండా మా మామయ్యతో అన్న మాటలు నేనెప్పుడూ మరచి పోలేను నేనీ రోజు ఏ విషయమేనా ఒకే కోణంలోంచి కాకుండా ఎదుటివైపు నుంచి కూడా ధైర్యంగా ఆలోచించ కలిగానంటే నా వ్యక్తిత్వంమీద ఆమె ప్రభావమే కారణం.

ఇక—మూర్ఖమైన మతమూ మూఢమైన ఆచారమూ చెయ్యీ చెయ్యీ పట్టుకుని గుడ్డిదర్బారు చేయిస్తున్న మన దేశంలోని లక్షలాది సామాన్య కుటుంబాల్లో ఒకదాన్నుంచి ఊడిపడింది. నా భార్య అన్నపూర్ణ. వాళ్ళమ్మగారిచ్చిన

వెండి పట్టీలు కాళ్ళకెప్పుడూ తియ్యకుండా ఘల్లు ఘల్లని చప్పుడు చేస్తూ. కూనిరాగాలు తీస్తూ ఇంట్లో పనిపాటలు చేసుకుంటున్న నాజూకైన ఆరోగ్య స్వరూపాన్ని చూసి ముచ్చటపడినా 'చూసి చూసి ఇలాంటి నాటు సరుకుని కట్టుకున్నానేం!' అని మనసు కంటక పడకపోలేదు. కాని నేను ఊహించింది పొరపాటని తెలియడానికి నా కాట్టే రోజులు పట్టలేదు. అట్టే చదువు లేకపోయినా ఆలోచనా జ్ఞానానికి ఏం తీసిపోలేదు అన్నపూర్ణ. హాస్యాన్ని అందుకునే ఆంతర్యం ఉంది. చల్లగా తిరిగి అందించగలచాతుర్యం ఉంది ... అంత కండే వేరే సంస్కారం అంటూ ఏముంటుంది!

అప్పటికి మాకు ఒక అబ్బాయే, ఆ రోజు ఏమైందా ...

"ఏమండీ. శనివారం పూటా ఇంట్లో కొబ్బరికాయ లేకుండా తండ్రీ కొడుకూ కొట్టుకు మింగేస్తే నేనెంతకని చావ నండీ! ఇప్పుడా వెంట్రవణమూర్తికి ఏం కొట్టేదీ ?" అని నా మీదకి రంయ్ మని లేచింది. ఈ అంధ విశ్వాశాలనుంచి తనని దూరం చేద్దామని అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను నేను, అందుకున్నాను.

"ఏదో ఒకటి కొట్టా లంటావ్, అంతే కదా ?"

"కాకపోతే !" అన్నట్టు చూసింది.

"కొబ్బరికాయ్ కొట్టాలని ఏ శాస్త్రంలో ఉంది. పెరట్లో బాదంకాయ దొరికింది, ఇస్తా కొట్టుకు తరించరాదా? పోనీ అంత దూరం వెళ్ళలేకపోతే మొన్న తెచ్చిన వేరుశెనగ కాయల్లో ఒకటి ఇందుకోసమే మిగిలినట్లుంది. వెదికి సమ

ర్పిస్తాను. అది కొట్టుకుని పుణ్యం మూట కట్టుకోరాదా, భక్తే కదా ప్రధానం!"

కోపంగా చూసింది. నా కళ్ళల్లోకి. నా చూపులలోని కితకితలను తట్టుకోలేక నవ్వేసింది. తనకే నిజంగా కోపం వస్తే ఈ పిచ్చి నమ్మకాలమీద బోధించే అవకాశం నాకు దొరికి ఉండేది. అది చేజారిపోడమే కాదు, మరోకటి కూడా జరిగింది.

ఆ మధ్యాహ్నమే మా ఫ్రెండొకడు మా యింటికి వచ్చాడు. వాడికి యాపిల్సు అంటే మహా యిష్టం. వాడి ఊళ్లో మంచివి దొరకవు. అయినా రూపాయిలిచ్చి మూడు పెద్దపళ్లు తెచ్చి 'అన్నపూర్ణకిచ్చేను కుర్రాడికి అందకుండా దాచమని. మేం ఎంతసేపు కబుర్లు చెప్పుకున్నా యాపిల్ ముక్కలు రాక పోతే కోపంగా లోపలికి వెళ్ళేను.

"చిన్న పొరపాటు జరిగిపోయిందండీ. ఇప్పుడెలా?" అంది అన్నపూర్ణ తల వంచుకుని.

"ఏమయిందో తొందరగా అఘోరించు"

"నేనేం చెయ్యను చెప్పండి, బాడు సామాన్యుడా? వాసనచూసి, పసిగట్టి గెద్దతిన్నట్టు పోయినట్లు తన్నుకుపో యాడు మూడు పళ్ళూ, దెబ్బలాడి ఒక్కటి లాక్కున్నా నను కోండి."

"పోనీ అది మాత్రం ఏదీ?"

"నేను మాత్రం మానవమాత్రురాలిని కానా? ఆ రంగు చూస్తే, చిన్నముక్క కొరకండే, పాడునోరు ఊరుకుంది కాదు। తీరా రాక రాక వచ్చిన ఆ అతిథి ముందా వాడికి ఎంగిలి

చేసింది పెడితే ఏం బాగుంటుందనీ... ... నేనేం భక్త శబరిని కాదు గదా! .. ..."

"... గొప్ప పని చేశావ్ ..." ముందు చెప్పి మరీ తీసు కొచ్చానే, బజారు నాలుగు మైళ్ళు గదా, ఇప్పుడు వాడి చేతిలో ఏ పళ్ళు పెట్ట మన్నావ్?"

"అన్నట్టు" ఏవో పళ్ళు పెట్టాలికదూ! అయినా నా వెర్రి గాని, యాపిల్ పండే అని ఏ పుస్తకంలో ఉందిలెండి, మీరలా కబుర్లు చెప్పుకుంటూ వుండండి. మన రేగు చెట్టు పళ్ళు కోయించి రెండు గాజు ప్లేట్లలో అమర్చి క్షణంలో తెస్తా. ఆలశ్యమై పోతుంది అంటారా? వేసవైను సీసాలు కడిగి బోర్లించి ఉంచాను. దేని అవసరం ఎప్పుడొస్తుందో చెప్పలేం కదా! రెండింట్లోనూ చక్కగా నిండుగా కీస్ మిస్ పళ్ళు పోసి యిస్తాను. కబుర్లాడు కుంటూ కబళించ రాదా, స్నేహం కదా ముఖ్యం!"

నా వెర్రి కోపం చూసి ఇక ఆపుకోలేక పక పకా నవ్వేసింది.

"ఇంకాస్సేపు ఇలా ఆడిస్తే నాపళ్ళు రాలగొట్టి మీ మిత్ర చూడామణికి నైవేద్యం పెట్టేలా ఉన్నారే!" అంటూ పక్క గదిలోకి ఒక్క అంగలో వెళ్ళి యాపిల్ పళ్ళు అమర్చి ఉంచిన ట్రేతో ప్రత్యక్షమైంది!

పోని ఆ విషయాన్ని అక్కడితో వదిలెయ్యాక సాగ దీస్తే నేనేమయినా చెప్పడానికి అవకాశం లభించి ఉండేది, ఆ సంగతి మరి ఎత్తదే! అప్పటి కింకా మన సమితి స్థాపన జరగ లేదు గాని నా మనసు. ఎప్పుడో ఈ పూజా పునస్కారాలకి

ఒక్క నమస్కారం పెట్టేసింది. వీటి విషయం యెవరితో నేనే మైనా వాదించగలిగేవాణ్ణి. ఏళ్లు గడిచినా ఇంట్లో అది దుర్లభం అయిపోతూ వచ్చింది.

మరోసారి బడినుంచి ఇంటికొచ్చిన మా పెద్దవాడు, పొరపాటున జోళ్ళతో వంటింట్లోకి వెళ్ళిపోతే గూబ గుయ్ మనిపించింది.

నేను అడ్డుకున్నాను. ఆకలితో వచ్చిన గుంట వెధవికి అమ్మ పెట్టేది అదేనా అని.

"ప్రూరంతా తొక్కి వస్తారు. ఆ జోళ్ళతో వంట చేసే గదిలోకి ఎలా రానివ్వనండీ? ఆ మాత్రం శుచీ శుభ్రం ఉండక్కర్లేదూ? ఇప్పుడే చెప్పకపోతే ఎలా?"

అవును ఇంకా ఆలస్యం చేస్తే ఎలా? పిల్లాడికి కాదు, తల్లికి చెప్పాలి. ఆలాంటివాళ్లకి మాటలతో లాభంలేదు. జోడు శుభ్రంగా ఉంటే ఫరవాలేదనుకుంటాను. నే నెలాగా కొత్తదొకటి కొనుక్కుందామని అనుకుంటూనే ఉన్నాను. ఆరోజేకొత్తజత ఒకటి పెట్టెతో సహా తెచ్చేను. చేత్తో పట్టుకునే లోపలికి వచ్చి పూజామందిరం అరుగుమీద విప్పి ఎదురుగా పెట్టాను.

ఏం హడావుడి చేస్తుందో అనుకున్నాను, అన్నపూర్ణ చెక్కు చెదరలేదు!

ఆరోజు రాత్రి సెకండ్ షో సినిమాకి వెళ్ళొచ్చేను నేను. కరెంటు పోయిందో ఏమో ఇంట్లో లైట్లు లేవు. బట్టలు మార్చుకుని ఇలా మంచం మీద మేను వాల్చేనో లేదో, కెవ్వుమని లేచి కూర్చున్నాను. మంచం మీద ఏదో

గుచ్చుకుంటూ ఇంత లావున, ఇంత పొడుగున... కొంపతీసి ఏ కొండ చిలువో చేర లేదుగద!

"ఎంత కేక వేశారండీ, అర్థరాత్రి అయిపోయింది గాని ఈ పాటికి ఊళ్ళో సగం జనం మన ఇల్లు నిండిపోయి ఉండురు!"

అని పక పక నవ్వుతూ అన్నపూర్ణ లైటు వేసింది. పక్క మీద చీపురుకట్ట!

"నీకేం బుద్ధుందా లేదా? పక్కమీద ఈ చీపురు కట్టేమిటి?"

"శుభ్రం అంటూ ఉండాలి గాని ఏ వస్తువు ఎక్కడుంటే నేం? పూజా మందిరం మీదకి జోళ్ళు చేరే అర్హత వున్న ఇంట్లో శయ్యాగారం చేరడానికి నోచుకోదా వెర్రి చీపురు కట్ట! గాభరా పడకండి, కొత్తదే! తడువుకుని సరదాపడతారని ఈ కొండ చిన్న దాన్ని అలా అలంకరించాను!"

అప్పటికి ఏ జవాబూ చెప్పలేక నేను ఊరుకున్నా, మర్నాడు మరో విధంగా మొదలెట్టేను.

"నువ్వేమంటే అనుగాని ఈ పాత పద్ధతులకి వీలయినంత తొందర్లో మనం స్వస్తి చెప్పాలి పూర్ణా"

"పాతా కొత్తా అనకండి. చెడ్డవయితే అలాగే చేదాం"

ఈ నోములూ వ్రతాలూ ఏమిటో మరీ మూర్ఖంగా తయారవుతోంది ప్రజ. టైం వేస్టూ, ఖర్చూను. నామీద ప్రేమ ఉంటే నువ్వేనా మానెయ్య కూడదూ?"

"అయ్యో మీమీద ప్రేమ చేతనేనండీ, ఇలాంటివి చేస్తూంట."

"వద్దు.మానెయ్యి. ప్లీజ్. నేనే చెబుతున్నాను గదా!"

అన్నపూర్ణ అడ్డు తగలక పోడం నాకెంతో ఉత్సాహాన్నిచ్చింది.

"ఎవరో వద్దు మన పక్కింటి డాక్టరు దంపతుల్నే తీసుకో... రోజురోజంతా రోగుల్ని పీల్చి డబ్బు చేసుకోడం తప్ప వాళ్ళకి మరో వ్యాపకం లేదు. వాళ్ళే తెల్లారుఝామున నాలుగూ అవకుండా మేళతాళాలతో భజనచేస్తూ నగర సంకీర్తనకి బయలుదేరి పోతున్నారు. ఇంతకంటె మోసం ఉందా? మన ఎదురింటి దత్తాత్రేయులుగార్నే చూడు. తన ఆరుగురి ఆడపిల్లలికీ పెళ్ళి చెయ్యక వాళ్ళు తెచ్చే జీతాలతో బతుకుతున్నాడు. అలాంటి నీచుడు ఏటేటా ఎంతో భక్తి ప్రపత్తులతో సీతా కల్యాణం జరిపించడం ఎందుకు చెప్పు?"

"అయితే భక్తులందరూ పరమదుర్మార్గులే అంటారా? మతంలో మంచితనానికి చోటే లేదంటారా?"

"ఏమో, ఇలాంటి వాటివల్ల మనుషులికి ఉపకారం కన్న అపకారమే ఎక్కువ. ఇంతకి దేశంలో ఒక మతమంటూ ఏడిసింది గనుకనా? మన మతమైనా విభేదాలు లేకుండా వర్ధిల్లుతోంది గనకనా! అసలు మతమనేదే మరి ఫైకిరానీని మాయ గుహ. వాటిలో మళ్ళీ అరలు, తెరలు, సూటి అయిన బతుకునిది కాంప్లికేట్ చేసి పారెయ్యడం లేదా పూర్ణ? సత్యాన్ని మరింత స్పష్టంగా చూడ్డం నీకుఇష్టంలేదా? నిజంగా

సరుకు ఉన్నదైతే ఇంత కర్మకాండ దేనికి? ఈ బాహ్యమైన పబ్లిసిటీ దేనికి!"

"సామాన్యులం. మానసికమైన ఆరాధనకి మనమెక్కడ తూగగలంలెండి... ఏదో ఎదుటి వారికి కీడు చెయ్యకుండా జాగ్రత్త పడుతూ ఇలా వెళ్ళి పోదాం లెద్దురూ..."

"ఇదిగో ఇలాంటి రాజీబేరాలే నా దగ్గిర కుదరవ్. ఏం తప్పుచేశామని బతుకులు 'ఎలాగో ఓలా' 'సామాన్యంగా' వెళ్ళ దీసుకోవాలి! నువ్వే అలా నిర్ణయించుకుంటే నిదారి నీదే. నేనుమాత్రం ఈ పైపై పటాటోపాలు మాటవరసకైనా ఒప్పుకోను సుమా!" అన్నపూర్ణకి ఏం తోచిందో పకపక నవ్వుతూ అంది.

"మీారే, మీారే! ఏవిటి నా పక్కన కూచున్న ఈ పెద్దమనిషే!"

తను ఎంతమాట తప్పిద్దామని చూసినా ఎందుకు నవ్విందో చెబితేగాని నేను వదల్లేదు.

"ఏం లేదండీ, మొన్న మీారు ఆఫీసుకి వెళ్ళినప్పటి ముచ్చట... ...

"ఏం," ఏం జరిగింది?

"ఏం లేదు, మరిచిపోగల్గితే మామూలుసంఘటనే... తలుచుకుంటే ఇప్పటికీ నా పొట్ట చెక్కలవక మానదు తీరా చెప్తే మీాకేం కోపం" వస్తుందో, పోద!.

"చెస్తావా, చెప్పవా?

"అబ్బెబ్బె స్కూటర్ స్టార్టుచేసి తమరు ఆరోజు ఆఫీసువైపు సుమారు ఓ మైలు వెళ్ళేసరికి ముందు అద్దంలో

ఏదో తళుక్కున మెరిసిందట. వెంటనే ఇంటి కొచ్చేశారు. ఏం కొంప మునిగిందో అని తింటూ తింటూ ఉన్న అన్నాన్ని వదిలిపెట్టి చెయ్యి కడుక్కొని వీధిలోకి పరిగెత్తుకు వచ్చాను- వస్తూనే మండిపడ్డారు:

—ఆడదానికి ఇంత అశ్రద్ధ అయితే మొగాడు నవ్వుల పాలు కాక ఏమౌతాడు! అంతంత కళ్ళున్నాయి ఎందుకూ నెమలి కన్నుల్లాగ! ఇంకా బోధపడలేదా!— హత్యానేరం ఆరోపించబడిన దోషికైనా తనుగురించి తను ఏదైనా చెప్పు కోడానికి ఛాన్సు ఇస్తారు, తమరు నాకు ఇవ్వలేదు! తెలియని ఏ మహాపాపానికి ఒడిగట్టానో కదా అని నిలువెల్లా వణికి పోయాను. తమరే శెలవిచ్చారు ఆఖరికి:

—అయ్యోరామ, ఇంకా అర్థం కాలేదా? ఈ క్రాఫింగులో కుడివైపున చూడు ఎంత పొడుగున ఉన్నాయో రెండు తెల్ల వెంట్రుకలు! వీటితో వెడితే అంతమంది పని చేస్తున్న ఆఫీసులో నా ఆబోరు దక్కేనా! ఇంకా పీకెయ్యవేమే నిగుడ్లు పీక!-నవ్వుకుంటూ, పాపం ఎండలో రెండు మైళ్ళు మిన్నుల్ని తప్పించిన ఆ ఫలిత కేశద్వయానికి జోహారుచేస్తూ వెంటనే పీకి పాకంపట్టే ననుకోండి. ఇంతకీ నాకీ జన్మలో తీరని సందేహం ఏమిటంటే మీ ఆఫీసులోని స్టాఫ్ యావన్మందికీ మీ పండు వెంట్రుకలవైపు చూడ్డంతప్ప మరేం పనిలేదా అని!" అంటూనే అన్నపూర్ణ అంటించింది.

"అందుకని బాహ్యమైన భ్రమలు తగ్గించుకోడం చెప్పినంత సులువు కాదు మహానుభావా!"

"తగ్గించు నేర్పేవు బోధనలు" అంటూ ఆ ప్రసంగాన్ని

ముగించడానికి విఫలప్రయత్నం చేస్తున్న నన్ను చూసి మరో సారి విరగబడి నవ్వింది అన్నపూర్ణ. ఆమెతో కలసి నవ్వకుండా నాకు మరో మార్గ మేముంది!

పార్థసారథి వింటున్నాడో లేదో అన్నట్టు మాధవరావు వైపు చూశాడు.

"ఈ తప్పు నీ భార్యదిగాదు, ఆమె పెరిగిన వాతావరణంది. అయినా మారుతున్న ప్రపంచంలో విప్లవాత్మక ధోరణిలో ముందడుగు వేస్తున్న మన తరుణారుణ సమితివాళ్ళకి సూర్యరష్మి ఎరగని ఆడకూతుళ్ళతో ఆర్గుమెంటు దేనికి! మునిగిపోయే వ్యక్తికి చెయ్యి అందిస్తే ఆ వ్యక్తిని రక్షించలేం సరిగదా మనమే మునిగిపోయే ప్రమాదం ఉంది. నీ విషయంలో అదే జరిగిందనుకుంటాను" అన్నాడు మాధవరావు.

"నేనలా అనుకోడంలేదు, ముందు చెప్పేది పూర్తిగా విను నీకేం బోరింగ్‌గా లేదుగద!'

"నాట్ఎటాల్. పైగా బాగా సరదాగా ఉంది. చెప్పు చెప్పు."

పార్థసారది కొనసాగించేడు.

ఇటు ఆఫీసు పనితోనూ అటు మన సమితి కార్యకలాపాలతోనూ రోజులు గుర్తించనంత వేగంగా గడచిపోతూ వచ్చేయి. నేను గౌరవించే పండితుల పరిచయంవల్ల, నేను ఎంచి చదువుకునే పుస్తకాలవల్ల, నా మార్గమే సరి అయినదని ఎప్పటికప్పుడు నాకు అనిపించేది. నా ప్రేమకే కాక గౌరవానికి కూడా అర్హురాలైన నా భార్యని నా వైపు తిప్పుకో లేకపోయినా నా చేతకానితనం నన్నప్పుడప్పుడు నిల

రియ్యకపోలేదు కాని నేను చేసేదేదీముంది! ఈ అయిదా
రేళ్లలో తను మాత్రం రీడింగ్ హేబిట్ బాగా ఇంప్రూవ్
చేసింది. తెలుగు పుస్తకం కనపడితే అది 'చార్వాక
సూత్రావళి' అయినా సరే పూర్తిగా చదవందే
వదిలిపెట్టేది కాదు. సహజమైన హాస్య ధోరణి వదల్లేదు
గాని మాటకి మాటా మునపట్లా జవాబు చెప్పడం మానే
సింది. కొంత నిదానం, నిండు తనం నేర్చుకుంది. నోములూ
వ్రతాలూ బాగా తగ్గించింది. ఈ కాస్త మార్పుకే నాకెంతో
ఆనందం కలిగింది. ఏదో మంచి ఇంగ్లీష్ సినిమా వస్తే., అన్న
పూర్ణని దగ్గిర కూచోబెట్టుకుని చూపించి బోధించాలని
సరదా పుట్టింది వోనాడు. తీరా ఇంటికి వచ్చేసరికి ఎవరో
మహాత్ములు ఉపనిషత్సారం చెబుతున్నారట వెళ్ళడానికి
రెడీగా ఉంది, ఒక చేతిలో ఇత్తడి సజ్జతో పూలతో ప్రసా
దంతో నేను వచ్చిన పని చెప్పి ఎంతో నిరుత్సాహ పడి
పోయాను. ఇప్పుడే వస్తానని లోపలికి వెళ్ళిపోయింది. ఆ
పట్టుచీరా పెద్దబొట్టూ మార్చేసింది. ఒక్క ముక్కలో చెప్పా
లంటే పెద్ద ముత్తైదువ ఫేషన్ లేడీగా మారిపోయి. వచ్చి
స్కూటర్ వెనకాల భైఠాయించి 'పదండి. ఇవాళ సినిమాకే
నాఓటు. రేపు వెడతాను లెండి అక్కడికి' అంది, 'రేపు
మాత్రం వెళ్ళక పోతేనేం అక్కడికి!' అని నేను అనలేక
పోయాను.

ఇంకో రోజు మనసమితి పనులయ్యే సరకి రాత్రితొమ్మి
దయి పోయింది. ఎంతో ఆకలితో ఇల్లుచేరేను. పెద్దవాడు
ఒక్కడే మేలుకునిఉన్నాడు. 'వేణుగోపాలస్వామి ఆలయంలో

అవతారాలు వేస్తున్నారుట నాన్నా... మాకు అన్నాలు పెట్టేసి అమ్మ వెళ్ళింది ఇప్పుడే వస్తానని! కబురు కాస్తా అం దించి వాడూ నిద్రకి ఉపక్రమించాడు.' "ప్రస్తుతం దేశాన్ని రక్షించేది నాస్తిక వాదం మాత్రమే" అని ఆనాడు ఉపన్య సించి అందరి మెప్పూ సంపాదించాను. ఇంటికొస్తే ఇదీ వరస... ఇవాళ ఏదో ఒకటి తేల్చెయ్యాలి... అనుకు న్నాను. ఎంతసేపు చూసినా రాదే! తల్లిప్రేమ ఎలాంటిదో నేనెరగను. నాపిల్లలకే కాదు. నాకూ ఉంది తల్లి అనిపిస్తూ ఉంటుంది అన్నపూర్ణ ప్రవర్తన. మరి ఇవాళ ఎందుకిలా చేసింది!

"ఏమ్మనుషులండీ బాబూ ఈ మెగాళ్లు! ఆడది వచ్చి వెలిగిస్తేగాని ఇంట్లో దీపం అయినా ఉంచుకోరు !" అంటూనే స్విచ్ వేసింది. అన్నపూర్ణ.

"నువ్వెళ్ళి ఆ ఆలయం నిండా దీపాలు వెలిగించి వచ్చే వుగా ! కట్టుకున్న మొగాడు ఇక ఏ కారు చీకటిలో చస్తే నీకేం ?"

"ఓయబ్బ! అంతంత మాటలనదగిన దుర్మార్గం అయ్య గారిలో లేదని నాకు తెలీదా యేం ! ఆహా, ఆకలి మను షుల్ని ఎన్నిరకాల ఆటలు ఆడిస్తుందీ ! ఒక్క పదినిమిషాలు. ప్లీజ్. కూర బాగుందని కుర్రాళ్ళు ఎగరేసేశారు. రెండు ముక్కలు వేయించి పెడతాను" నేను వద్దంటూంటే వినకుండా నిమిషాల మీద అన్నీ అయ్యాయనిపించి, దగ్గిరుండి తినిపించి నాకోపం సగం కరిగించింది.

"అన్నట్టు నువ్వు భోంచేశావా ?"

"ముందు మీ కడుపు నింపితేగాని నేను మిగల్నేమో నని వెర్రి భయం వేసిందండీ! ఇప్పుడే తినేసి వస్తాను. నిద్ర పోకండి. మీతో చిన్న కబురు చెప్పాలి."

"నేనూ అడగాలి. సాటి మనిషిని హింసపెట్టి భక్తి పేరుతో నువ్వు దక్కించుకున్న దేమిటో!" అనుకున్నాను. తమలపాకు చిలకలు ఒకటీ ఒకటీ నోటికి అందిస్తూ, పంచదార పలుకులు కూడా ఒకటీ ఒకటీ చెవిలోకి పంపించింది.

"అవతారాలు ఇవాళతో అయిపోతాయట. చాలా బాగా చేశారని విన్నాను. మీరెలాగా ఇవాళ ఆలశ్యంగా వస్తారని తెలుసు. అందుకనే బయలుదేరేను. పోనీ దారిలోనే కదా మా భానుకూడా వస్తుందేమోనని, మా రమేశం బావ ఇంటికెళ్లేనండీ. తీరా వెడితే అది లేదు. పిల్లల్ని తీసుకుని సినిమా కెళ్ళిందట.

అయితే ఈ రాత్రివేళ గంటన్నరసేపు అన్నపూర్ణ వర సకి బావ అయిన దూరపు బంధువుతో గడిపిందా! ఇంతకన్నా వేణుగోపాలుడే నయమే!

మళ్ళీ పూరపందిలా పెంచాడు శరీరం, ఏం లాభం. ఉత్తి ఊక! సమయానికి వెళ్లేను గానీ ఏమైపోనో వెర్రిముండా వాడు! వాళ్లూ ఇల్లు దిగిన అరగంట దాకా బాగానే ఉన్నాట్ట. ఉన్నట్టుండి మలేరియా జర్వం వచ్చి పడిందట. ఇదివరకు ఇలా రావడం అలవాటుందిట మా రమేశం బావకి. అయితేనేం ఎంత భయమో... ఎంత గొడవో! వెళ్ళేసరికి చలీ కుదుపుతో ఇంతెత్తున లేచి పడుతున్నాడు. అంతకంటే కొంచెం ఎత్తుగానే లేచి పడుతున్నాడు పెళ్లాంమీద. అందమైన మాన

తెలుగులో ఇన్ని అసహ్యాకరమైన తిట్లు ఉన్నాయని ఇదివరకు నేనెరగను సుమండీ ! ఇంట్లో ఉన్న శాలువలూ రగ్గులూ. అన్నీ కప్పి, పక్కవాళ్ళ కుర్రాడ్ని బతిమాలి డాక్టరు దగ్గరికి పరిగెత్తించాను. ఆయనొచ్చి ఇంజక్షన్ ఇచ్చాక కాస్త నయం! అప్పటికీ నన్ను వెళ్ళనియ్యదే ! 'నువ్వేమీ చెయ్యనక్కర్లేదు. అలా కూచో. అంతే చాలు. పిలిచినట్లు వచ్చి బతికించావు, వెళ్ళిపోతావా?' అని అంత మనిషీ కళ్ల నీళ్లు పెట్టుకుని అడుగుతూంటే అక్కణ్ణుంచి కదల్లేక పోయాను సుమండీ... సినిమానుంచి వచ్చిన ఆ కులవధూటికి-ఈ కులపర్వతాన్ని అప్పజెబితే గాని అక్కణ్ణుంచి కదలడానికి అయింది కాదు. అప్పటికే పది దాటింది. ఇంకెక్కడ వెళ్ళను గుడికి ? మరోరోజు వెళ్ళొచ్చు. ఏం పోయింది. పండక్కి వెయ్యరా మళ్ళీ అవతారాలు—అనుకుని ఇంటికి వచ్చేశానండి గబగబా అని పూర్తిచేసింది. అన్నపూర్ణ.

ఇంకేమని నిలదియ్యను ఆమెని! అయినా అందరూ అన్నపూర్ణలే కాదుగదా! మతం పేరిట ప్రజాధన దుర్వినియోగాలూ పెరుగుతున్నాయి దేశంలో. అందుకనే ఇంట్లో నేనేం చెయ్యలేకపోయినా సమితి కార్యక్రమాలకేమీ అంతరాయం ఏర్పడలేదు.

ఇంతవరకూ ఒకలా వెళ్ళిన నా జీవితం నేనెప్పుడూ ఎదురు చూడని మలుపు తిరిగింది. నేను పైపనులే గాని ఇంట పనులు పట్టించుకుని ఎరుగ నెప్పుడూ. ఇంటి పనులే కాక బజారు పనులు పహా అన్నపూర్ణ చక్కబెట్టేది. [illegible] [illegible]

చెయ్యవలసిన సమయం ముందుందని కలలో కూడా అనుకోలేదు.

"అంత మార్పేం వచ్చింది,?" అన్నాడు మాధవరావు ఆత్రుతగా, పార్థసారధి చెప్ప నారంభించాడు.

ఓరోజు పెరట్లో బట్టలుతుక్కుంటున్న అన్నపూర్ణ ఉన్నట్టుండి పడి పోయింది. నోటివెంట నురుగు. కాళ్ళూ చేతులు గిలగిల తన్నుకోజొచ్చింది. నాలికకరిచేసుకుంది. ఎదురుచూడని విషయమేమో చేతి దగ్గిర బాగా కొట్టుకుపోయింది. అదృష్టవశాత్తూ నేను ఇంట్లో ఉన్నాను. వెంటనే డాక్టర్ని పిలిచాను. ఆయన సలహామీద న్యూరాలజీ స్పెషలిస్టు శర్మగార్ని కలిసి అన్ని విషయాలు చెప్పేను. ఆయన అడిగిన మీదట ఇంట్లో పెద్దవాళ్ళు ఎవరూ లేరనీ - చురుకైన నా భార్య దగ్గిర ఆమె రోగం దాచడం అసాధ్యమని చెప్పాను. ఈసారి మా ఇద్దర్నీ పక్కపక్కని కూచోబెట్టి శర్మగారు. చెప్పారు.

"ఎపిలెప్సీ అని అదొక రకమైన మూర్ఛరోగం మెదడులో ఉన్న కొన్ని అతి సున్నితమైన నరాల ఓవర్ ఏక్టివిటీ వల్ల ఇది వస్తుంది. దీన్నుంచి తప్పించుకోవాలంటే నరాల ఉదృతాన్ని జోకొట్టడం తప్ప మరొక మార్గంలేదు. అందుచేత మీరు నిత్యం నిద్రమాత్రలు వాడాలి. ఇది చాలా దురదృష్టకరమైన రోగం. మరి జన్మలో రాకపోవచ్చు. మరుక్షణంలో వచ్చినా రావొచ్చు... ధైర్యంగా ఎదుర్కోడం తప్ప మరో మార్గంలేదు. మాత్రలు ఒకటి రెండు రోజులుకాదు. కనీసం నాలుగేళ్ళ పాటయినా వాడాలి! అన్నిటికన్నా ముఖ్యం రోగిని ఒక్కక్షణం అయినా విడవకుండా ఇరవై నాలుగు

గంటలూ ఎవరైనా తోడు ఉండాలి..." ఇలా ఎవో కొన్ని దారుణమైన సత్యాలు చెప్పేరు. ఇంతింత మొహాలు చేసుకొని ఇవతలి కొచ్చాం. అన్నపూర్ణని రిక్షాలో కూర్చోపెట్టి నేను మళ్ళీ శర్మగారి దగ్గరకి వెళ్ళేను.

"అయితే ఇదిప్పట్లో తగ్గదా డాక్టరు గారూ !"

"మీారలా అధైర్య పడకండి సారథీ! ధైర్యం వహించి ఆమెకు వీలయినంత వోదార్పూ ఉల్లాసం కలిగించండి. మళ్ళీ రాదనే నమ్మకంతో నే ఉండాలి మనం. చెప్పేనుగా ఎప్పుడేనా వస్తే రావచ్చుని. అదీ మరచి పోకూడదు!

అప్పుడప్పుడు వీధిలో మూర్ఛవాళ్ళ ఇత్తడి బిళ్ళలతో ప్రత్యక్షమౌతూంటారు. మూర్ఛలో ఉన్నట్టుండి పడిపోతూ ఉంటారు. బిందెల కొద్దీ నీళ్ళు దిమ్మరిస్తే లేస్తూ ఉంటారు. అదీ ఇదీ ఒలాంటి దేనా? కాదని చెప్పండి డాక్టరు గారూ!"

కాదని నేనెలా చెప్పగలను సారథీ! బాధపడి ఏం లాభం? ఇందాక ఆవిడ ముందు చెప్పకూడదని ఊరుకున్నాను!

ఈగార్డినాల్ మాత్రలు అతి జాగ్రత్తగా వాడాలి, కొగి అందుబాటులో ఎప్పుడూ ఉంచకండి. ఎక్కువ వేసుకుంటే ప్రాణాపాయం. రెండు పూటలా మీారే స్వయంగా ఇవ్వండి. పిల్లలకి అందుబాలో అసలు వుంచకూడదు. వింటున్నారా?

ఇంకేమిటి వినేది, నా మొహం. ఆఫీసులో కూచుని పనిచేసే వాణ్ణి గాని ఎప్పుడూ ఇంటిమీాదే దృష్టి. పిల్లలు స్కూళ్ళకి వెళిపోగానే వీధి తలుపులు వేసుకుని ఒక్కర్తీ ఉంటుంది. ఏ టిఫినో చేస్తున్నప్పుడు స్టవ్ మీాదపడి కాలిపోతే! నూతిదగ్గర ఫిట్‌వచ్చి నీళ్లలో పడిపోతే! ఎప్పుడూ ఉండే

పసిపిల్లలను పెట్టేనుగాని అది జ్వరం వచ్చి ఆరోజు రాలేదు. పెద్దవాడికి ఆ పూట శెలవు పెట్టించే ఇంట్లో కూచోపెట్టేను గాని, ఆట సరదా, ఎప్పుడూ ఇంట్లో ఉంటాడని మాట ఏముంది! ఆ రోజు రెండింటిదాకా ఎలాగో ఆఫీసులో ఉండ గలిగేను. ఇక భరించలేక మేనేజర్ని బతిమాలి శెలవడిగి ఇల్లు చేరుకున్నాను. నే అనుకున్నంతా అయింది! ఇంట్లో తను తప్ప ఎవరూ లేరు!

తలుపు తట్టగా తట్టగా వో అరగంటకి తీసింది. జోగుతూ తూగుతూ. పదిహేను రోజులై ప్రతీరోజూ నిద్రమాత్రలు మింగుతున్న మనిషి ఏలా ఉంటుంది! నిద్ర... నిద్ర ...రాత్రి పగలూ అన్న భేదం లేదు. నిద్రలేదా పరధ్యానం మతిమరుపు ఆ వీధి చివర్న మా ఇల్లు. పగలే జనసంచారం తక్కువ. ఏ ఫిట్ అయినా వస్తే ఏమైపోవాలి? నాకోసం గంటల తరబడి అరుగుమీద నిలబడి ఎదురు చూసేది. అంతదూరం నుంచి నన్ను చూస్తూనే పరుగెత్తుకు దగ్గరిగా వచ్చి—ఎలా ఉండేది నిన్న మొన్నటి దాకా! కళ్ళల్లో కాంతీ, మాటల్లో ఆ చురుకు దనం ఏమై పోయాయి! తలుపు తీసినదాన్ని దగ్గరగా తీసుకుని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుని అలా ఎంతసేపో కూచుండి పోయాను. బతికుంది గదా అని నిట్టూర్చాను. ఎందుకిలా జరిగింది. ఏం తప్పు చేశామని మాకీ శిక్ష?"

మాధవరావు ఇక ఆగలేదు.

"సరే ఇక చెప్పేదేముంది! ఏ జన్మలోనో చేసిన పాపం ఈ విధంగా అనుభవిస్తున్నానని జవాబు చెప్పుకుని వుంటావు. సంఘర్షణ వచ్చినప్పుడు తట్టుకునే మనో ధైర్యం

ఎందరికుంటుంది! ఇలాంటి పరిస్థితుల్లో పిరికివాళ్ళు తమకి తాము జవాబు చెప్పుకోటానికి కర్మ సిద్ధాంతాన్ని మించింది లేదు. ఉన్నపాటున భక్తాగ్రేసరుడిగా మారిపోయి ఉంటావు, అంతేనా?"

పార్థసారథి అంతకన్న ఊరుకోలేదు.

"ఆపత్సమయంలో మనసుకి ఊరట కలిగించేది అది అహింసా సూత్రమైనా, అత్యుగ్రవాదమైనా దానికి జోహారే. ఇంతకీ నా భార్య రోగగ్రస్థురాలైనంత మాత్రాన నేను కన కనబడ్డ దేవుణ్ణల్లా మొక్కేసుకోలేదు. నన్ను పూర్తి చెయ్యనియ్యి. మధ్యలో ఆపకు. కుతూహలం కలిగించే కథా విధానం అంతా ముందే ఉంది... ..."

"మధ్యాహ్నం అలా జరిగిందా, రాత్రి చాలా ఆలోచించాను. ఇక ఈ పని మనుషుల్ని నమ్మడానికి లేదు. దగ్గిర వాళ్ళ నెవరైనా తీసుకురావాలి. నావైపు ఎవరూ లేరు. ఇలా ఉంది పరిస్థితి అని మామగారికి రాశాను. లబోదిబోమంటూ మా అత్తమామలు వెంటనే వచ్చి పడ్డారుకూడా మా మరదలు కామాక్షిని తీసుకొచ్చేరు. పాపం కిందటేడే ఆ అమ్మాయి మొగుడు రైలు ఏక్సిడెంటులో పోయాడు. పిల్లలు లేరు విడిమనిషిని ఆమెను ఇంట్లో వుంచి వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. Acc No. D-2526.

చెల్లిలి చేత వీలైనంత తక్కువ పని చేయిద్దామని అన్నపూర్ణ మొదట్లో చేసిన ప్రయత్నం విఫలమై పోయిందనే చెప్పవచ్చు. ఎంత బైట పడకూడదని ప్రయత్నించినా నిత్యం తీసుకునే నిద్రమాత్రలు ఎంత అలవాటయినా కొంతవరకు

ఆమెని లొంగదియ్యక తప్పలేదు. తీరూ తెన్నూ లేని రోగం వచ్చి పడిందే, ఎంతైనా మనసు క్రుంగిగాకుండా ఉంటుందా! అక్క చేతిలో ఉన్న అన్నీ కళ్ళెలూ ఒకటీ ఒకటీ క్రమంగా కామాక్షి చేజిక్కించుకుంది."

"నేను లేనుటే, పిల్లలికి తలంటడానికి నువ్వు రావాలా? నిన్ను అట్టే శ్రమపడ వద్దని డాక్టరుగారు చెప్పలేదూ ?"

"జబ్బు మనిషివికదా, నువ్వు బట్టలు ఉతకొచ్చా ? పక్షివాన్నె వచ్చి పడిపోతేనో ? అన్నీ నువ్వే చేసుకుంటే మధ్య నన్నెందుకు పిలపించారూ ?"

"మొన్న రూపాయి నోటనుకుని రెండ్రూపాయల నోటు పనిదాని చేతిలో పెట్టేవుట, అది మంచిది కాబట్టి సరి పోయింది. ఎందుకొచ్చిన మతిమరుపు పనులు చెప్పు?"

"నిన్నటి రోజున కూరలో ఇంగువ ఎక్కువ చేసేశావట కూరలేకుండా రొట్టెలెలా తింటారు ? విసిరేశారుట పాపం ఆకలితో వచ్చారు పిల్లలు స్కూల్నించి. ఏదేనా చదువు కుంటూ నువ్వు పడుకో రాదుటే ?"

ఎవర్తో ఒకర్తి ఆపదలో వచ్చి అప్పురాలై ఇల్లు నడుపు తోందనే ధైర్యంతో ఆఫీసు పనేగాక చాలా నెలలై వెనక పెట్టిన మన సమితి కార్యకలాపాల్లో సహా యధావిధిగా పాల్గొంటూ వచ్చేను.

రాత్రి ఇంటికివచ్చి భోజనం ముగించే సరికి సాధార ణంగా అన్నపూర్ణ పడుకునే ఉండేది. ఒకవేళ మేలుకుని ఆమె దగ్గరకి పిల్చినా ఇత్తడి బిళ్ళా బిందెడు నీళ్ళూ జ్ఞాపకం వచ్చి మనసు అదోలా అయిపోయేది. అటు తిరిగి పడుకునే

వాణ్ణి. కామాక్షి నాకు అట్టే ఎదురుపడితే ఏం చేసిపోతానో అన్నంతగా ఆమెపట్ల నాకు ఆకర్షణ ఏర్పడి ఆకలిగొన్న నన్ను అటువైపు లాగజొచ్చింది. ఇది వీలయినంత ఎక్కువ చెయ్యడానికే ఆమె అహోరాత్రాలు కృషిచేసి కృతకృత్యురాలయిందను కుంటాను. ఇంటినే కాక ఇంటి యజమానిని కూడా పూర్తిగా లొంగదీసుకుందామనే కామాక్షి కోరికకి ఆరాత్రే అనుకోకుండా అవకాశం లభించింది.

అప్పుడు ఏ పన్నెండో అవుతుందను కుంటా. మంచి వెన్నెలరాత్రి. బాత్‌రూమ్‌లకి వెళ్ళొస్తూంటే వరండాలో మెట్లు మీద ఎవరో కూర్చున్నట్టు తుళిక్కిపడ్డాను. చూస్తే కామాక్షి.

"ఏం నిద్రపట్టడం లేదా!" అన్నాను ఓ క్షణం నిలబడి.

"ఎవరికీ, నీకా? నాకా, మన ఇద్దరికీనా?" అంది అదోలా నవ్వుతూ కూచోమని సంజ్ఞ చేస్తూ. కూచుంటూంటే ఎందుకో ఒళ్ళు వేడెక్కింది. ఓ గడి కూచున్నాక ఏదో ఒకటి అనాలని మొదలుపెట్టేను.

"పాపం, నిండు వయసులో ఒకొక్కళ్ళ కెంత అన్యాయం జరుగుతూ ఉంటుంది!"

"నిజమే! ఆడుతూ పాడుతున్న అక్క ఇలా హటాత్తుగా రోగిష్టిదై మంచానపడి నీబతుకుని ఎడారి చేస్తుందని ఎవరను కుంటారు బావా!"

బాగానే తిప్పి కొట్టింది గాని అందులో ఎంత కఠిన సత్యం ఉంది. కామాక్షి పరిస్థితికంటె నాదేమంత మెరుగ్గా

ఉంది గనక!

"ఇలా కేవలం నోటి సానుభూతివల్ల ఏం లాభం బావా!" అంది శాస్త్ర దగ్గరగా జరుగుతూ, అంత చల్లదనంలో నా నుదుటిమీద చెమటబిందువులు నిలిచేయి.

"ఇవాల మధ్యాహ్నంపూట నీ పరుపుమీద నువ్వు లేకుండా చూసి ఎవరో దొంగలని పిల్లల్ని కేకలేశావు, గుర్తుందా బావా? అలా దొర్లింది ఎవరో ఈపాటికీ నువ్వు పోల్చుకునే ఉంటావు. ఈసారి ఆ వ్యక్తికి అలా పగటిపూట, ఒంటరిగా దొర్లాలని మాత్రం లేదు సుమా!"

కిలకిల నవ్వుతూ నాకు మరింత దగ్గరగా జరిగింది. లోపలి గదిలో ఏదో అలికిడైనట్టు తోచింది నాకు

"కొంప మునిగింది. మీ అక్క లేచినట్టుంది."

"ఏం పిరికిమనిషివయ్యా, మళ్ళీ ఏదో పెద్ద సభలూ సమావేశాలూ నిర్వహిస్తున్నట్టు పోజులుకొడతావ్! అక్కయ్య ఇప్పట్లో లేవదులే, మూడు మాత్రలు ఇచ్చానుగా కూచో!"

ఇదివరకు డాక్టరుగారు చెప్పినట్టు నేనే నిద్రమాత్రలు ఇచ్చేవాడిని. వారం రోజులై ఆ ఛార్జికూడా కామాక్షి తీసుకుంది.

"అదేమిటి? పూటకి రెండు గార్డినల్ మాత్రలే కదా కదా ఇవ్వవలసింది!"

"ఒకటి ఎక్కువ ఇస్తే అంత గాభరా ఎందుకూ, కూచో" ఏమో నాకు కూచో బుద్ధి పుట్టలేదు. ఈసారి కామాక్షి లేచి నా రెండు చేతులూ పట్టుకుంది. నేను వదిలించేశాను.

"అవున్లే, నాదే తప్పు, ఆడది తనైవస్తే ఏ మొగాడు ఇంతకన్నా ఊదబొడిచాడు గనక! ఒక్కటిమాత్రం సూటిగా నా కళ్ళల్లోకి చూసి మరీ చెప్పు. నేనంటే నీకు ఇష్టంలేదా? ఎంతైనా అక్కపాటి చెయ్యలేక పోయినా!" ఆ నిలుచున్న తీరూ, కళ్ళల్లో కళ్ళుపెట్టి ఆ అడిగిన పద్ధతి నన్ను వివశుణ్ణి చేశాయి. ఆమెను దగ్గరగా తీసుకుంటూ అన్నాను.

"బాగుంది. మిసమిస లాడుతున్న నువ్వెక్కడ, నిత్య రోగిష్టి అదెక్కడ?" ధన్ మని చప్పుడయింది గదిలో. మేమిద్దరం పరిగెత్తి చూసేసరికి అన్నపూర్ణ నోట నురుగులు కక్కుతూ నేలనుపడి విలవిల కాళ్ళూ చేతులూ తన్నుకుంటుంటోంది!

ఈసారి వచ్చిన ఎటాక్ మునపటంత సులువుగా తగ్గలేదు ఓరోజు శలవు పెట్టిన నేను, మూడ్రోజులు పొడిగించవలసి వచ్చింది. ఆసాయంత్రం పిల్లలు ఆడుకోడానికి పోయారు. కామాక్షి, పక్కింటికి బాతాఖానీకి వెళ్ళింది. అన్నపూర్ణ మంచం పక్కని కుర్చీలో కూచుని పేపరు తిరగేస్తున్నాను నేను.

"ఏమండీ" నీరసంగా వున్నా ఆపిలుపు నాకు స్పష్టమే నురెప్ప లెత్తి ఏమన్నట్లు చూశాను.

"మీతో మాట్లాడాలి, దగ్గరగా రండి" ఎంతలా పాడయి పోయింది ఈ మూడ్రోజులకీ!

ఓ కోరిక ఉందండీ ... ఎప్పట్నుంచో అణచి పెట్టుకుని ఉన్నాను... ఇక దాచుకో లేక పోతున్నాను. మీకు ఇష్టముండదని తెలుసు కాని, కాదనరు కదూ?"

"పూర్ణా" నీకు అన్యాయం చేశాను. నన్ను నువ్వు క్షమించనక్కర్లేదు... నీకు ఏ శాస్త్ర సుఖం కలుగుతుందన్నా ఏ పని చెయ్యడానికైనా నేను సిద్ధమే, అందా మనుకున్నాను. ఆఖరికి కన్నీళ్లైనా కార్చలేని కఠిన రాతి గుండె నాది.

"ఎప్పుడో నా చిన్నప్పటి ముచ్చట ఇది. నాకప్పుడు పదకొండు ఉంటాయి. మా అమ్మా నాన్నా మా పిల్లలందర్నీ మా పెదనాన్న గారింట్లో వదిలేసి దక్షిణ దేశ తీర్థ యాత్రలకని బయల్దేరారు. రెండ్రోజులు ఏకధారగా ఏడ్చి అన్నం మానేసి పట్టుబడితే నన్ను మాత్రం వెంట బెట్టుకు వెళ్ళక వాళ్ళకి తప్పలేదు. వాళ్ళతో అన్నీ చూశాను. తెలిసీ తెలియని జ్ఞానం. అయినా ఆ గోపురాల ఎత్తూ ఆ ప్రాకార విశాల తత్వమూ నా మనసుని పట్టేశాయి. దేవుడు మేలు వేస్తే ఉత్తర దేశం కూడా వెళ్ళి పుణ్య తీర్థాలన్నీ తిరిగి రావాలని ఎన్నాళ్ళో కోరిక ఉండేది. కాని మీతో ఇన్నాళ్లై కాపురం

చేస్తూ మీ ప్రేమతో పిల్లల మమతతో సంసారం లోని తియ్యదనం చుక్క చుక్కా రుచి చూశాక ఎక్కడికీ వెళ్లాలని నా కనిపించలేదు. ఆ మాటే మరచిపోయాను ... కాని ... కాని ..." అన్నపూర్ణ ఇక చెప్పలేక అతి ప్రయత్నంతో అటు తిరిగి పడుకుంది. కాని ఆ నిశ్శబ్దం లోని నిండు నిజం నా గుండెకి వినపడక పోలేదు.

"మొదట విధి నన్ను వంచించింది, దారుణమైన బాధ అనుభవించినా తట్టుకున్నాను, విధి ఎలా ఉంటుందో నేను ఎరగను కనుక పసివాళ్ళు నన్నే లోకువ కడితే సర్దుకున్నాను, పైవాళ్ళు కనుక. కడుపున పుట్టిన పిల్లలే నామాట కాదంటే భరించాను, పసి పిల్లలు కనుక, తోడ బుట్టిన చెల్లెలే ద్రోహం తలపెడితే సహించాను. ఎంతయినా చిన్నది కనుక. కాని మనసు పెట్టిన చోటే మోసం ఎదురైతే ఆశించిన చోటే అన్యాయం జరుగుతే ఇక ఏంచేసుకు అక్కడుండాలి! మనిషిని సాటి మనిషే మోసంచేస్తే, తెలీని ఏ అతీత శక్తినో నమ్ముకుని ఆర్తనాదం చెయ్యక దెబ్బతిన్న హృదయం చేసేదేముంది!"

అటు తిరిగిన అన్నపూర్ణని నావైపు తిప్పుకుంటూ అడిగాను.

"అయితే ఓసారి నార్త్ కూడా తిరిగి రావాలని ఉందందూ?"

"అవునండీ... ఎవరితో నయినా నన్ను పంపరూ?"

"ఏం, నేనే తీసికెళ్ళ కూడదా!" మెరిసే కళ్ళతో అడిగాడు!

"నిజంగా!"

"ఇంతవరకు జరిగిందంతా నిజమే అయితే ఇదీ నిజమే!"

"అంటే?"

"కాపురానికి రాకముందు నువ్వు నాకెంత కొత్తో నీకూ నేనంత కొత్త కదా! మొదట్లో అప్పుడప్పుడు నన్ను ఆటపట్టించినా నేను సితోకన్న నువ్వు నాతో సర్దుకున్నదే ఎక్కువ. వారానికో మారు నువ్వు గుడికి వెళ్ళేవనీ ఏ పండుగకో పబ్బానికో ఓ సారి నువ్వు పూజ చేసే దానివనీ నా మనసు విలవిలలాడి పోయి నీ కెన్నో అభ్యంతరాలు కల్పించేది. కాని నీమనసుకి ఏ మాత్రం సరిపడని నాస్తిక సమాజ కార్యకలాపాలలో తల మునకలుగా చిక్కుకుని ఏనాడు ఎంతరాత్రి ఇంటికొచ్చినా నువ్వు ఒక్కనాడంటే ఒక్కనాడు అసహనం ప్రదర్శించలేదు! ఇదంతా నీపట్ల నిజం అయినపుడు— నాకు ఇష్టం లేనిదీ నీకు ఇష్టం అయినదేదీ ఒక్కటైనా నేను చేయగలిగానే ఘనత— అది మాత్రం ఎందుకు నిజం కాకూడదు!"

ఆ సాయంకాలమే డాక్టరు శర్మ గారితో చెప్పేను. తప్పకుండా వెళ్ళి రమ్మనీ, తనదైన తోడు ఉకరున్నారనే

తృప్తి ఏ రోగాన్నయినా తప్పక తగ్గిస్తుందనీ ఆయన చెప్పేరు.

"మీరు తీర్థయాత్రలే వెడతారో తిరు వీధులే వేంచేస్తారో నాకెందుకు! ఎలా వచ్చానో అలాగే పోతాను. లోకమేం గొడ్డు పోలేదుగద!" అంటూ అప్పటి కప్పుడు ప్రయాణామై ఎంత చెప్తున్నా వినకుండా కామాక్షి వెళ్ళిపోయింది.

పార్థసారథి చెప్పడం ముగించి మాధవరావువైపు చూశాడు. అతను అన్నాడు.

"ఈ మాత్రం భాగ్యానికి ఆత్మవంచన కూడా ఎందుకు సారధీ? జబ్బుతో ఉన్న భార్యపట్ల ఘోరమైన ద్రోహం తల పెట్టేవు. ఏ గంగలోనో మునిగి ఆ పాపం కడుక్కుందామని బయల్దేరుతున్నావు, ఒప్పుకోరాదూ?"

"ఇంతా విని నువ్వు అలాఊహిస్తే నేను సరిగ్గా చెప్పలేకపోయానన్నమాట। తనతో కూడా వస్తున్నాననే తప్ప, కూడా ప్రతీ దేవాలయంలోకీరానని అన్నపూర్ణకి స్పష్టంగా తెలుసు. ఆమెకిది తీర్థయాత్ర అవుతే నాకిది ప్రేమయాత్ర కాకూడదా యేం? అందుకనే అప్పుడే పిల్లల్ని మా మావగారింట్లో ఏలూరిలో దిగబెట్టి మరీ వచ్చేను. మనకి నచ్చని భావాలు ఎదుటవాడిలో ఉంటేనేం, వాడి వ్యక్తిత్వాన్ని గుర్తించడానికి అవి అడ్డురావాలా యేం? అదిగాక దైవచింతగాని నాస్తికతగాని జనరలైజ్ చేసి ఎనలైజ్ చెయ్యవలసిన విషయాలుగా నాకు

తోచడంలేదు. ఎవరికివారు చిరకాల తపనచేత, సాధనచేత తెలుసుకో వలసిన సత్యాలు అవి. నా అనుభవం నాకు చెప్పిన నిజం ఒకటుంది. గొప్పవాడా బీదవాడా అనేది కాదు. ముఖ్యం మనసుందా లేదా అని. అలాగే భక్తుడా నాస్తికుడా అనేది కాదు ముఖ్యం, మనిషి అవునా కాదా అని. ఎవరమైతేనేం. మొదట మనం మనుషులం."

మాధవరావు పార్థసారథివైపు ఆశ్చర్యంగా చూశాడు. ఇద్దరూ లేచారు.

—/ *** /—